# కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లీ పాతరోజులే..



వేంపల్లిలో మంత్రి వేములను గజమాలతో సన్మానిస్తున్న గ్రామస్తులు

- కరెంట్ కష్టాలు, రైతులకు తిప్పలు
- హస్తం పార్టీది అబద్ధాల మ్యానిఫెస్టో
- నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశా..
- మరోసారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తా
- రుణమాఫీ అందరికీ అందితీరుతుంది..
- బాల్కొండ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- ముప్కాల్, మెండోరా మండలాల్లో ఎన్నికల ప్రచారం

ముప్కాల్, నవంబర్ 18 : కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే మళ్లీ పాతరోజులే వస్తాయని, బాల్కొండ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డికి కరెంటు మీద ఏ మాత్రం అవగాహన లేదన్నారు. అమెరికాలో, ఇక్కడా మూడు గంటల కరెంటు వ్యవసాయానికి చాలని ఘంటాపథంగా చెప్పుకుంటూ తిరుగుతున్న రేవంత్‌ను, ఆ పార్టీని అధికారంలోకి తెస్తే రైతులకు కష్టాలు తప్పవన్నారు. శనివారం ఆయన ముప్కాల్, మెండోరా మండలాల్లో పర్యటించారు. ఉదయం ముప్కాల్ మండలం వేంపల్లి, కొత్తపల్లి, నల్లూర్, సాయంత్రం మెండోరా మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేముల మాట్లాడుతూ.. కారు గుర్తుకే ఓటు వేసి బీఆర్ఎస్‌నే గెలిపించాల్సిన ఆవశ్యకత ఎందుకున్నదో వివరించారు. తనకన్నా ముందు ఎమ్మెల్యేలుగా పని చేసిన వారు గ్రామాల్లో పరిష్కరించని సమస్యలన్నింటినీ తాను పూర్తిచేసినట్లు తెలిపారు. గతంలో పని చేసిన వారు వేంపల్లి, నల్లూర్‌కు కొత్త సబ్‌స్టేషన్లు మంజూరు చేయించలేకపోయారని, తాను ఎమ్మెల్యేగా గెలువగానే మంజూరు చేయించానని గుర్తు చేశారు. గతంలో ఇటువంటి పనులు చేయని పార్టీలే మళ్లీ గెలిస్తే అభివృద్ధి వెనుకబడి పోతుందన్నారు.అందుకే కారు గుర్తుకు ఓటు వేసి తనను, కేసీఆర్‌ను గెలిపించాలని కోరారు.

**అది అబద్ధాల మ్యానిఫెస్టో**

కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టో అబద్ధాల మ్యానిఫెస్టో అని, అలవికానీ హామీలతో అధికారంలోకి రావాలని చూస్తోందన్నారు. సీఎం కేసీఆర్ చెప్పిందే చేశారని, ఇప్పుడు చేయగలిగేవే చెబుతున్నారని అన్నారు. రుణమాఫీ రైతులందరికీ పూర్తిస్థాయిలో అందుతుందని, దీనిపై ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని నమ్మవద్దని సూచించారు. కాంగ్రెస్ హయాంలో రైతుల బతుకులు ఘోరంగా ఉండేవన్నారు. ఆ పార్టీ వారి బతుకుల్లో మార్పు తేవడానికి చేసిందేమీ లేదని మండిపడ్డారు. కరెంట్, నీళ్లు ఇవ్వలేకపోయారని గుర్తు చేశారు. వారి హయాంలో రైతుల పంట ఎప్పుడూ కూడా పూర్తిగా పండలేదన్నారు. కాంగ్రెస్ పాలనలో తోటకు, ఇంటికీ కరెంట్ ఇవ్వలేదన్నారు. రైతులను, వ్యవసాయాన్ని చిన్న చూపు చూసేలా మాట్లాడిన రేవంత్‌ను, ఆ పార్టీని దరిదాపుల్లోకి కూడా రానీయొద్దని ఆయన పిలుపునిచ్చారు. ఓటును ఆషామాషీగా భావించకుండా రాష్ట్రభవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వేయాలని సూచించారు. మరోసారి తనను ఆశీర్వదించి గెలిపిస్తే మరో ఐదేండ్లు మీ కళ్లముందే మీకు అందుబాటులో ఉంటూ ఇదే తరహాలో అభివృద్ధిని అందిస్తానని హామీనిచ్చారు. నల్లూర్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ, కాంగ్రెస్ పార్టీ నుంచి జక్కుల రాజేశ్వర్, గొల్ల రాజు, చిలివేరి రాజేశ్వర్, రంజిత్ సలావుద్దీన్ మంత్రి వేముల సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ప్రచార కార్యక్రమంలో బీఆర్ఎస్ ముప్కాల్ మండల అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్, ఎంపీపీ సామ పద్మ, జడ్పీటీసీ బద్దం నర్సవ్వ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కోటపాటి నర్సింహ నాయుడు, డాక్టర్ మధుశేఖర్ పాల్గొన్నారు.

## గూగుల్‌లో కొట్టి చూడండి..

**తెలంగాణ పథకాలు కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో లేవు: వేముల**



బట్టాపూర్‌లో మాట్లాడుతున్న వేముల

ఏర్గట్ల, నవంబర్ 18 : 'యువకులు, రైతులు గూగుల్‌లో కొట్టి చూడండి... తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న రైతు బంధు, రైతు బీమా, కల్యాణలక్ష్మి తదితర మానవీయ పథకాలు కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఉండవు..' అని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం ఆయన ఏర్గట్ల మండలం బట్టాపూర్, తడ్‌పాకల్, ఏర్గట్లలో ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోకు విజన్ లేదన్నారు. కులసంఘాల భవనాలకు తాను మంజూరు చేయించిన ప్రొసీడింగ్‌లు ఫేక్ అని మాట్లాడుతున్న వాడు మూర్ఖుడు అని విమర్శించారు. వారి పార్టీ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. చెప్పుకోవడానికి ఏమీ లేక బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పనులపై దుష్ప్రచారం చేస్తుండడం విడ్డూరమన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థే మాట్లాడడం దురదృష్టకరమన్నారు. ఏర్గట్లను మండలంగా మార్చి అభివృద్ధి పథంలో నిలిపానన్నారు.



కొత్తపల్లిలో స్వాగత ర్యాలీలో పాల్గొన్న చిందు కళాకారులు

# ప్రచారంలో బీఆర్ఎస్ జోరు

- ఇంటింటికీ పార్టీ శ్రేణులు
- వేములను గెలిపించాలని విజ్ఞప్తి



బాల్కొండలో ఇంటింటా ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కమ్మర్‌పల్లి/ మోర్తాడ్/భీమ్‌గల్/ బాల్కొండ/వేల్పూర్/ మెండోరా, నవంబర్ 18 : బాల్కొండ బీఆర్ఎఎస్ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి చేపట్టిన అభివృద్ధి పనులను గుర్తు చేస్తున్నారు. కమ్మర్‌పల్లి మండలంలోని పలు గ్రామాల్లో శనివారం బూత్ స్థాయిలో ఇంటింటా ప్రచారం చేశారు. మోర్తాడ్ మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రచారం ఊపందుకున్నది. బ్లాక్‌ల వారీగా టీంలను ఏర్పాటు చేసుకుని ఇంటింటికీ ప్రచార కార్యక్రమాలను చేపట్టారు. కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారంలో సర్పంచ్ బోగధరణీ ఆనంద్, ఎంపీటీసీ రాజ్‌పాల్, సదన్, జమాల్ తదితరులు పాల్గొన్నారు. భీమ్‌గల్ పట్టణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కన్నె ప్రేమలత, మహిళా కౌన్సిలర్లతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను వివరించారు. బాల్కొండ మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించి కేసీఆర్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు.



భీమ్‌గల్‌లో ఇంటింటా ప్రచారం

వేల్పూర్ మండలంలోని ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రచారం కొనసాగింది. కారు గుర్తుకు ఓటు వేసి వేములను గెలిపించాలని కోరారు. మెండోరా మండలంలో జడ్పీటీసీ తలారి గంగాధర్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అందించిన ఫలాలను వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి వేముల ప్రశాంత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.



వేల్పూర్‌లో బీఆర్ఎస్ మ్యానిఫెస్టో కరపత్రాలను అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



మోర్తాడ్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



కమ్మర్‌పల్లిలో..

## నేడు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రచారం

వేల్పూర్, నవంబర్ 18 : బాల్కొండ నియోజకవర్గంలో వేముల ప్రశాంత్‌రెడ్డి ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు భీమ్‌గల్ మండలం సంతోష్‌నగర్ తండా, 9.30 గంటలకు సుదర్శన్‌నగర్ తండా, 10 గంటలకు జాగిర్యాల్, 11.30 గంటలకు కుప్కల్ తండా, సాయంత్రం 5 గంటలకు ముప్కాల్ మండలం వెంచిర్యాల్, 6.30 గంటలకు రెంజర్లలో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు.

## ఓటరు స్లిప్పుల అందజేత



బుస్సాపూర్‌లో ఓటరు స్లిప్పులను అందజేస్తున్న ఎంపీడీవో

బాల్కొండ, నవంబర్ 18 : మండలంలోని పలు గ్రామాల్లో ఓటరు స్లిప్పులను శనివారం అందజేశారు. బీఎల్వోలు, రెవెన్యూశాఖ అధికారులు, అంగన్‌వాడీ టీచర్ల సహకారంతో ఇంటింటికీ వెళ్లి ఓటరు స్లిప్పులను అందజేసి, ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఆశ కార్యకర్త మాధవి, వీవోఏ రాజమణి తదితరులు పాల్గొన్నారు.

**మెండోరా మండలంలో..**

మెండోరా, నవంబర్ 18: మండలంలోని సోన్‌పేట్, మెండోరా, కొడిచెర్ల గ్రామాల్లో ఎంపీడీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం ఓటర్ల స్లిప్పులను పంపిణీ చేశారు. ఈనెల 30న జరగనున్న ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని ఓటర్లకు సూచించారు. కార్యక్రమంలో సెక్రటరీలు బోజేందర్, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

## 21 నుంచి ఉప్లూర్‌లో సాయి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

కమ్మర్‌పల్లి, నవంబర్ 18 : మండలంలోని ఉప్లూర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ షిర్డీ సాయి బాబా దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభమవుతాయని వీడీసీ, శ్రీ సాయి సేవా సమితి సభ్యులు తెలిపారు. ఈ నెల 21 నుంచి 23 వరకు ఉత్సవాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.